# సాక్షి సిద్దిపేట

బుధవారం । 14 । ఆగస్టు । 2024


## న్యూస్‌రీల్

### పంద్రాగస్టు వేడుకలకు అతిథిగా మంత్రి పొన్నం



సాక్షి, సిద్దిపేట: స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలకు ముఖ్య అతిథిగా మంత్రి పొన్నం ప్రభాకర్‌గౌడ్ హాజరై జాతీయ జెండాను ఆవిష్కరించనున్నారు.. ఈ మేరకు ప్రభుత్వ కార్యదర్శి శాంతి కుమారి ఉత్తర్వులు జారీ చేశారు. సిద్దిపేట పట్టణంలోని డిగ్రీ కళాశాలలో వేడుకలను అధికారంగా నిర్వహించనున్నారు. ఇందుకోసం ఇప్పటికే జిల్లా యంత్రాంగం ముమ్మరంగా ఏర్పాట్లు చేస్తోంది.

### సిద్దిపేట బంద్ ప్రశాంతం



సిద్దిపేటలోని సుభాష్‌రోడ్డులో మూసివేసిన దుకాణాలు

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): హిందూ ఐక్య సంఘాల ఆధ్వర్యంలో నిర్వహించిన సిద్దిపేట బంద్ ప్రశాంతంగా ముగిసింది. బంగ్లాదేశ్‌లో హిందువులపై జరుగుతున్న దాడులను నిరసిస్తూ ఈ బంద్ చేపట్టారు. మంగళవారం ఉదయం నుంచే జిల్లా కేంద్రంలోని వ్యాపార సంస్థలను మూసి ఉంచారు. ప్రైవేట్ విద్యా సంస్థలు సెలవు ప్రకటించాయి. హిందూ ఐక్య సంఘాల నాయకులు, కార్యకర్తలు పట్టణంలో బైక్ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ బంగ్లాదేశ్‌లోని హిందువులపై మారణకాండ జరుగుతోందన్నారు. మారణకాండ, అకృత్యాలను నివారించే విధంగా ఆ దేశంపై ఒత్తిడి తీసుకురావాలన్నారు. ఇలాంటి సంఘటనలు జరగకుండా ఆ దేశ నాయకులు ప్రత్యేక చొరవ తీసుకోవాలన్నారు.

### దరఖాస్తుల ఆహ్వానం

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): జిల్లా స్థాయి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు డీఈఓ శ్రీనివాస్‌రెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. జిల్లాలోని అన్ని ప్రభుత్వ, గురుకులాలు, కేజీబీవీలు, స్థానిక సంస్థల పాఠశాలల్లో విధులు నిర్వహిస్తున్న ఉపాధ్యాయులు దరఖాస్తులకు అర్హులన్నారు. ఆసక్తి కల్గిన ఉపాధ్యాయులు, ప్రధానోపాధ్యాయులు ఈ నెల 23లోగా జిల్లా విద్యాశాఖ అధికారి కార్యాలయంలో దరఖాస్తులు అందజేయాలన్నారు.

### విద్యాధరి సేవలో మేజిస్ట్రేట్



అమ్మవారి సన్నిధిలో ప్రియాంక దంపతులు

వర్గల్(గజ్వేల్): వర్గల్ విద్యాసరస్వతి క్షేత్రాన్ని మంగళవారం గజ్వేల్ మేజిస్ట్రేట్ ప్రియాంక దంపతులు సందర్శించారు. అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. వారికి అర్చకులు ఆశీర్వచనం చేశారు. అమ్మవారి శేష వస్త్రం, తీర్థప్రసాదాలు అందజేశారు.

### నాచగిరిలో నేటి నుంచి పవిత్రోత్సవాలు



నాచగిరిలో కొలువైన లక్ష్మీనారసింహులు

వర్గల్(గజ్వేల్): ప్రసిద్ధమైన నాచగిరి లక్ష్మీనృసింహ క్షేత్రం పవిత్రోత్సవాలకు సిద్ధమైంది. బుధవారం నుంచి శనివారం వరకు నాలుగు రోజుల పాటు హవనాలు, పారాయణం, విశేష పూజా కార్యక్రమాలు జరుగుతాయని ఆలయ ఈఓ అన్నపూర్ణ తెలిపారు. సాయంత్రం 6.30 గంటలకు ఉత్సవాలకు అంకురార్పణ జరుగుతుందన్నారు. గురువారం ఉదయం 8.30 గంటలకు అగ్ని ప్రతిష్ఠ, మూర్తి కుంభ స్థాపన, పవిత్ర అధివాసం, పవిత్రారోపనం, సాయంత్రం మూల మంత్ర హోమం, ద్రావిడ ప్రబంధ పారాయణం జరుగుతుంది. శుక్రవారం ఉదయం మూల మంత్ర హవనం, ద్రావిడ ప్రబంధ పారాయణం, శనివారం ఉదయం మహాపూర్ణాహుతి, మూర్తికుంభ ప్రోక్షణ, ప్రబంధ పారాయణం జరుగుతుందన్నారు. ఈ మహోత్సవంలో భక్తులు పాల్గొని తరించాలని ఈఓ కోరారు.

## ఏసీబీ ఆకస్మిక తనిఖీ

- బీసీ వసతి గృహంలో సోదాలు
- రిజిస్టర్ల మెయింటెనెన్స్ లేదు
- ఏసీబీ మెదక్ రీజియన్ డీఎస్పీ సుదర్శన్



బీసీ వసతి గృహంలో కిరాణా వస్తువులను తూకం వేస్తున్న ఏసీబీ అధికారులు

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ బీసీ వసతి గృహాన్ని ఏసీబీ అధికారులు మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు ఈ తనిఖీలు కొనసాగాయి. పలు రికార్డులను పరిశీలించారు. ఏసీబీ మెదక్ రీజియన్ డీఎస్పీ సుదర్శన్ ఈ సందర్భంగా మాట్లాడుతూ జూన్, జూలై నెలలకు సంబంధించిన అబ్‌స్ట్రాక్ లేదన్నారు. శానిటైజేషన్, ఫుడ్ సెఫ్టీ, లీగల్ మెట్రాలజీ, అడిట్‌శాఖల అధికారులతో కలిసి తనిఖీలు నిర్వహించామన్నారు. వసతి గృహంలో విద్యార్థుల అటెండెన్స్ రిజిస్టర్‌ను సక్రమంగా నిర్వహించడం లేదన్నారు. గైర్హాజరైన విద్యార్థులకు ఆబ్‌సెంట్ అని కాకుండా కేవలం '' . '' (డాట్) మాత్రమే రిజిస్టర్‌లో నమోదు చేశారన్నారు. అదేవిధంగా వసతి గృహానికి సంబంధించిన వివిధ రకాల రిజిస్టర్లను ప్రతి రోజు క్రమం తప్పకుండా నిర్వహించాల్సి ఉంటుందన్నారు. తనిఖీలలో 12 రకాల రిజిస్టర్లను మెయింటెన్స్ చేయడం లేదని తేలిందన్నారు. స్థానిక వార్డెన్ రిజిస్టర్‌ల నిర్వహణలోనూ లోపాలున్నాయన్నారు. వీటిపై ఉన్నతాధికారులకు నివేదిస్తామన్నారు. కార్యక్రమంలో ఏసీబీ సీఐలు రమేష్, వెంకటేశ్వర్లు, లీగల్ మెట్రాలజీ అధికారి అనిల్‌కుమార్, ఫుడ్‌సేఫ్టీ అధికారి శ్రీశిక, శానిటరీ అధికారి సైదులు, ఆడిట్ అధికారి సచిన్, ఇతర అధికారులు పాల్గొన్నారు.



స్టేడియంలో ఏపుగా పెరిగిన గడ్డి, పుట్టగొడుగులు

## ఇలా అయితే ఆడేదెలా?

ఒకప్పుడూ జిల్లా, రాష్ట్ర స్థాయి క్రికెట్ పోటీలకు సిద్దిపేట స్టేడియం వేదిక. ప్రస్తుతం రూపురేఖలే మారిపోయాయి. మైదానం నిర్వహణ, పర్యవేక్షణ లోపించడంతో పిచ్చిమొక్కలతో పొలాన్ని తలపిస్తోంది. రూ.కోట్లు వెచ్చించి నిర్మించిన క్రికెట్ స్టేడియం ప్రస్తుతం వినియోగంలో లేకపోవడంతో పుట్టగొడుగులు, పిచ్చిమొక్కలకు నెలవుగా మారింది. వీకెండ్‌లో క్రికెట్ ఆడాలని ఎదురుచూస్తున్న క్రీడాకారులకు నిరాశే ఏర్పడుతోంది. సంబంధించిన క్రీడాశాఖ అధికారులు చొరవ చూపి స్టేడియాన్ని మెరుగుపరచాలని క్రీడాకారులు, అభిమానులు కోరుతున్నారు.

–సిద్దిపేటజోన్

## కిస్సా.. కుర్సీకా!

**ఒకే కుర్చీపై ఇద్దరు డీఐఈఓలు**

- ఒకరు ఫీల్డ్‌లో.. ఇంకొకరు కార్యాలయంలో..
- కమిషనరేట్ ఆర్డర్ ప్రకారం ఒకరు
- కోర్టు స్టేటస్ కో అనుసరించి మరొకరు
- గందరగోళంలో ఇంటర్మీడియెట్ విద్య
- అయోమయంలో అధ్యాపకులు, సిబ్బంది

జిల్లా అధికారిని నేను అంటూ ఒకరు.. కాదు నేనేనని మరొకరు.. ఇలా ఒకే కుర్చీ కోసం ఇద్దరు డీఐఈఓలు పోటీ పడుతున్న విచిత్ర ఘటన జిల్లాలో చోటు చేసుకుంది. ఒకరు క్షేత్ర స్థాయిలో తనిఖీలు చేపడుతుంటే, మరొకరు జిల్లా కార్యాలయంలో విధులు నిర్వర్తిస్తున్నారు. ఫలితంగా ఇంటర్మీడియెట్ విద్యలో గందరగోళం నెలకొంది. అధ్యాపకులు, సిబ్బంది అయోమయానికి గురవుతున్నారు.

– సాక్షి, సిద్దిపేట

జిల్లా ఇంటర్మీడియెట్ విద్యాధికారి (డీఐఈఓ) సూర్యప్రకాశ్ జూన్ 30న పదవీ విరమణ పొందారు. దీంతో బెజ్జంకి ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్‌గా విధులు నిర్వర్తిస్తున్న హిమబిందుకు ఇన్‌ఛార్జి డీఐఈఓగా బాధ్యతలను అప్పగించారు. జూలై1 నుంచి డీఐఈఓగా హిమబిందు కొనసాగుతూ వచ్చారు. అయితే జూలై చివరి వారంలో కోహెడ ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్‌గా కరీంనగర్‌లో పని చేస్తున్న రవీందర్‌రెడ్డి సాధారణ బదిలీల్లో భాగంగా ఇక్కడకు వచ్చారు. దీంతో హిమబిందు సిద్దిపేట ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలకు బదిలీ అయ్యారు.

**ఆర్‌జేడీ ఉత్తర్వులతో..**

వరంగల్ రీజియన్ పరిధిలో ఉన్న 14 జిల్లాలకు సంబంధించి, ఆయా జిల్లాల్లో సీనియర్ ప్రిన్సిపాల్స్‌గా కొనసాగుతున్న వారికి ఇన్‌ఛార్జి డీఐఈఓలుగా బాధ్యతలు అప్పగిస్తూ వరంగల్ ఆర్‌జేడీ జయప్రద ఆగస్టు 6న ఆదేశాలు జారీ చేశారు. దీని ప్రకారం జిల్లాలో సీనియర్ అయిన కోహెడ ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్‌గా ఉన్న రవీందర్ రెడ్డికి డీఐఈఓగా అవకాశం వచ్చింది. ఈ నెల 8న రవీందర్ రెడ్డి బాధ్యతలు స్వీకరించారు. ఆర్‌జేడీ ఉత్తర్వులను సవాల్ చేస్తూ హిమబిందు హై కోర్టును ఆశ్రయించారు. ఈ అంశంపై హై కోర్టు 8న స్టేటస్ కో ఇచ్చింది.

**ఇద్దరూ విధుల్లోనే..**

ఈ నెల 8 నుంచి జిల్లాకు ఇద్దరు డీఐఈఓగా విధులు నిర్వర్తిస్తున్నారు. ఇద్దరు డీఐఈఓ హోదాలో ప్రభుత్వ కళాశాలలను తనిఖీలు చేస్తున్నారు. మంగళవారం దుబ్బాకలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలను హిమబిందు విజిట్ చేశారు. అటెండెన్స్ రిజిస్టర్‌ను తనిఖీ చేసి, అధ్యాపకులతో సమావేశం సైతం నిర్వహించింది. ఓ పక్క డీఐఈవో కార్యాలయంలో రవీందర్ రెడ్డి విధులు నిర్వర్తిస్తున్నారు.

**అయోమయం**

అసలైన డీఐఈఓ ఎవరని ప్రిన్సిపాల్స్, అధ్యాపకుల్లో అయోమయం నెలకొంది. అధికారిక ఉత్తర ప్రత్యుత్తరాలు ఎవరితో జరపాలనే అంశంపై గందరగోళానికి గరవుతున్నారు. కనీసం సెలవు కావాలంటే ఎవరికి సమాచారం ఇవ్వాలనే అంశంపై తికమకపడుతున్నారు. జూనియర్ కాలేజీ విద్యలో నెలకొన్న గందరగోళ పరిస్థితిపై ఇంటర్ బోర్డు సభ్యులు దృష్టి పెట్టాలని కోరుతున్నారు. ఈ తతంగమంతా ఇంటర్ బోర్డు కమిషనరేట్ తెలిసే జరుగుతుందని విద్యార్థి సంఘాలు ఆరోపిస్తున్నాయి.



డీఐఈఓగా కార్యాలయంలో విధులు నిర్వర్తిస్తున్న రవీందర్ రెడ్డి

### నేను సీనియర్‌ను..

జిల్లాలో ఉన్న ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్స్‌లో నేను సీనియర్‌ను. నాకు ఇన్‌చార్జి డీఐఈఓ బాధ్యతలను అప్పగించారు. కోర్టు స్టేటస్ కో ఇస్తే దాని ద్వారా ఆర్‌జేడీ నుంచి ఉత్తర్వులు ఇవ్వాలి. అలా కాకుండా స్టేటస్‌కో తో ఎలా కొనసాగుతారు? కమిషనర్, ఆర్‌జేడీ దృష్టికి తీసుకెళ్లాను. – రవీందర్ రెడ్డి

### ఒకేసారి ప్రమోషన్ పొందాం

రవీందర్‌రెడ్డి, నేను ఒకేసారి 2013లో ప్రిన్సిపాల్‌గా ప్రమోషన్ పొందాం. ఒకే బ్యాచ్ వాళ్లం. కనుక నాకు సీనియర్ ఎలా అవుతారు. ఈ అంశంపై, నాకు అన్యాయం జరిగిందని కోర్టును ఆశ్రయించాను. ఆర్‌జేడీ ఉత్తర్వులపై స్టేటస్ కో ఇచ్చింది. డీఐఈఓగా నా విధులు నేను నిర్వర్తిస్తున్నా. –హిమబిందు

### కార్పొరేట్‌కు దీటుగా విద్యనందించాలి

దుబ్బాక: కార్పొరేట్‌కు దీటుగా నాణ్యమైన విద్యను అందించాలని జిల్లా ఇంటర్మీడియెట్ విద్యాధికారి(డీఐఈఓ) హిమబిందు అన్నారు. స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలను మంగళవారం ఆమె సందర్శించారు. కళాశాల అధ్యాపకులతో ప్రత్యేక సమావేశమయ్యారు. కళాశాలలో చదివే విద్యార్థుల సంఖ్య, లెక్చరర్లతో సమస్యలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వంద శాతం ఉత్తీర్ణత సాధించే విధంగా అధ్యాపకులు అంకిత భావంతో పనిచేయాలన్నారు. అడ్మిషన్ల సంఖ్యనూ పెంచాలన్నారు. కార్యక్రమంలో లెక్చరర్లు పాల్గొన్నారు.



దుబ్బాకలో అధ్యాపకులతో మాట్లాడుతున్న డీఐఈఓ హిమబిందు

## రైతుల సభ్యత్వాలను పెంచండి




మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ గరీమా అగర్వాల్

- అదనపు కలెక్టర్ గరీమా అగర్వాల్
- కలెక్టరేట్‌లో డీఎల్‌ఎంసీ సమావేశం

సిద్దిపేటరూరల్: ఎఫ్‌పీఓ సెంటర్లలో రైతుల సభ్యత్వాలను పెంచాలని అదనపు కలెక్టర్ గరీమా అగర్వాల్ అధికారులను ఆదేశించారు. కేంద్ర ప్రభుత్వ సెంట్రల్ సెక్టార్ స్కీం ఫర్ ఫార్మేషన్ అండ్ ప్రమోషన్‌లో భాగంగా డిస్ట్రిక్ట్ లేవెల్ మానిటరింగ్ కమిటీ సమావేశాన్ని మంగళవారం కలెక్టరేట్‌లో నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లాలో సీఎస్‌ఎస్ స్కీం ద్వారా 11 మండల క్లస్టర్లలో ఎఫ్‌పీఓలను నియమించారు. అదనపు కలెక్టర్ మాట్లాడుతూ ఎఫ్‌పీఓ సెంటర్లలో రైతుల సభ్యత్వాల సంఖ్య పెంచాలని సీఈఓ, డైరెక్టర్లకి సూచించారు. రైతులు కేంద్ర స్థాయి పథకాలను ఉపయోగించుకుంటూ వ్యవసాయ, అనుబంధ రంగంలో అభివృద్ధి సాధించాలన్నారు. ఉద్యాన శాఖలో కూరగాయల పెంపకం, డ్రిప్ ఇరిగేషన్, ఆయిల్ పంప్ ప్లాంటేషన్‌కు సంబంధించి రైతులకు మేలు చేసే యునిట్లను తెలిపి ప్రోత్సహించాలన్నారు. సమావేశంలో నాబార్డు డీడీఎం నిఖిల్, డీఆర్డీఏ పీడీ జయదేవ్ ఆర్య, ఎల్డీఎం హరిబాబు, డీఏఓ మహేష్, డీహెచ్‌ఎస్‌ఓ సువర్ణ తదితరులు పాల్గొన్నారు.

**బ్యాంకర్లకు అందించాలి**

మహిళా శక్తి కార్యక్రమంలో భాగంగా జిల్లాలోని 5 మున్సిపాలిటీల్లోని మెప్మా సిబ్బందితో అదనపు కలెక్టర్ గరీమా అగర్వాల్ సమావేశం నిర్వహించారు. ఇప్పటివరకు వచ్చిన దరఖాస్తుల వివరాలు తదితర అంశాలను మెప్మా పీడీ హన్మంత రెడ్డి వివరించారు. గరీమా అగర్వాల్ మాట్లాడుతూ మహిళా శక్తి కార్యక్రమానికి సంబంధించిన దరఖాస్తులను వెంటనే స్క్రూటినీ చేసి వెంటనే ఆయా బ్యాంకులకు పంపించాలన్నారు. ఆయా బ్యాంకులతో సంప్రదింపులు జరిపి యూనిట్లు గ్రౌండింగ్ పూర్తి చేసేలా చొరవ తీసుకోవాని లీడ్ బ్యాంక్ హరిబాబును ఆదేశించారు. సమావేశంలో యూనియన్ బ్యాంక్ ప్రతినిధి అరుణ్, స్టేట్ బ్యాంక్ అఫ్ ఇండియా ప్రతినిధి జయంత్, ఏపీజీవీబీ బ్యాంక్ ప్రతినిధి రవికుమార్, మెప్మా సిబ్బంది సాయికృష్ణ, రాజు , సంతోష, మమత, సరిత, రేణుక, రమ్య శ్రవణ్, శశిధర్ తదితరులు పాల్గొన్నారు.

### ఎల్‌ఆర్‌ఎస్ దరఖాస్తులను పరిశీలించండి

సిద్దిపేటరూరల్: జిల్లా వ్యాప్తంగా వచ్చిన ఎల్‌ఆర్‌ఎస్ దరఖాస్తులను క్షేత్ర స్థాయిలో పరిశీలించి ఆన్‌లైన్‌లో పొందుపరచాలని అదనపు కలెక్టర్ గరీమా అగర్వాల్ సూచించారు. మంగళవారం ఎల్‌ఆర్‌ఎస్ పై రెవెన్యూ, పంచాయతీ, మున్సిపల్, ఇరిగేషన్ శాఖల అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ల్యాండ్ రెగ్యులరైజేషన్ స్కీమ్ ద్వారా భూములను రెగ్యులరైజ్ చేసుకునేందుకు గతంలో స్వీకరించిన దరఖాస్తులను క్షేత్రస్థాయిలో పరిశీలించాలన్నారు. ఎలాంటి వివాదాలు లేని భూములకు మాత్రమే లెవెల్ వన్ అధికారులైన మండల పంచాయతీ అధికారి, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్, ఇరిగేషన్, మున్సిపల్ అధికారులు గుర్తించి నివేదికలు అందించాలన్నారు. కార్యక్రమంలో డీఆర్ఓ నాగరాజమ్మ, జిల్లా పంచాయతీ అధికారి దేవకీదేవి, కలెక్టరేట్ ఏఓ రెహమాన్, మున్సిపల్ కమిషనర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

## బెజ్జంకిలో ఈశాన్య రాష్ట్రాల ప్రతినిధులు



సహకార పరపతి సంఘం వద్ద ప్రతినిధుల బృందం

బెజ్జంకి(సిద్దిపేట): ఈశాన్య రాష్ట్రాల ప్రతినిధుల బృందం మంగళవారం బెజ్జంకి సహకార పరపతి సంఘాన్ని సందర్శించింది. డీజీఎం బైద్యనాథ్ సింగ్ ఆధ్వర్యంలో 23 మంది ప్రతినిధులు వచ్చి పరిశీలించారు. వీరు ఈ నెల 8 నుంచి వివిధ రాష్ట్రాలలో పర్యటించి బ్యాంక్ రిస్క్‌బేస్డ్ ఆడిట్‌పైన క్యాంపస్ ట్రెనింగ్ తీసుకుంటున్నట్లు తెలిపారు. సహకార సంఘంలో చేపట్టిన వ్యవసాయరంగానికి సంబంధించి క్రయవిక్రయాలను చైర్మన్ శరత్‌రావు వివరించారు. సంఘం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న పెట్రోల్‌బంక్, నిర్మాణంలో ఉన్న ఫంక్షన్ హాల్, కాంప్లెక్స్ నిర్వహణను తెలుసుకున్నారు. సొసైటీ నిర్వహణ చాలా బాగుందని వారు కితాబునిచ్చారు. తమ రాష్ట్రాలలో ఇదే విధానాలను అమలు చేస్తామన్నారు. కార్యక్రమంలో కేడీసీసీ బ్యాంక్ సీఈఓ ఎస్ సత్యనారాయణరావు, బెజ్జంకి సీఈఓ వాసు, వైస్ చైర్మన్ రమేష్, డైరెక్టర్లు పాల్గొన్నారు.

## ఓపీ చీటీల కోసం రగడ

సిద్దిపేటకమాన్: సిద్దిపేట ప్రభుత్వ జనరల్ ఆస్పత్రి వద్ద మంగళవారం రగడ చోటు చేసుకుంది. ప్రైవేటు దంత వైద్యులు వచ్చి ప్రభుత్వ ఆస్పత్రి తీరుపై మండిపడ్డారు. ప్రభుత్వ ఉద్యోగుల ఓపీ చీటీలు మాకు ఇవ్వడంలేదని, కమీషన్ ఇచ్చే ఆస్పత్రులకు మాత్రమే అందిస్తున్నారని వీరు ఆరోపించారు. రోగులను సైతం ఇబ్బందులకు గురిచేస్తున్నారని ఆగ్రహించారు.

**విషయం ఇదీ..**

ఎవరైనా పేషెంట్లు, ప్రభుత్వ ఉద్యోగులు ప్రభుత్వాస్పత్రిలోని డెంటల్ విభాగంలో చికిత్స కోసం వస్తే పరీక్షించి, చికిత్స అందించి, మందులు అందజేస్తారు. ఒకవేళ అక్కడ అందుబాటులో లేని చికిత్స కోసం హైయ్యర్ సెంటర్లకు రిఫర్ చేస్తారు. ప్రభుత్వ ఉద్యోగులు ప్రైవేటు ఆస్పత్రులలో చికిత్స తీసుకుంటే వారికి ఈహెచ్‌ఎస్ కింద బిల్లులు రీయింబర్స్‌మెంట్ రావాలంటే ముందుగా ఏదైనా సర్కారు ఆస్పత్రిలో వైద్యుడిని సంప్రదించినట్లు ఓపీ చీటీపై ఆస్పత్రి సీల్ వేసి తీసుకెళ్లాల్సి ఉంటుంది.

ఇదిలా ఉంటే ప్రభుత్వ ఆస్పత్రిలోని డెంటల్ విభాగ వైద్యులు ఓపీ స్లిప్‌లు ఇవ్వకుండా తమ దగ్గరే పెట్టుకుంటున్నారని పట్టణంలోని ప్రైవేటు దంత వైద్యులు ప్రభుత్వాస్పత్రికి వచ్చి డెంటల్ విభాగ వైద్యులను అడిగారు. దీంతో వైద్యులు పోలీసులకు సమాచారం ఇవ్వడంతో త్రీ టౌన్ పోలీసులు ప్రభుత్వాస్పత్రికి వచ్చి వివరాలు తెలుసుకున్నారు. ప్రభుత్వాసుపత్రి డెంటల్ విభాగ వైద్యులు మాట్లాడుతూ ఆస్పత్రిలో ఓపీ సేవల కోసం వచ్చే పేషెంట్లకు వారిని పరీక్షించి, మందులు రాసిన తర్వాతే చీటీని ఇస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో సిద్దిపేట ప్రైవేటు ఆస్పత్రుల దంత వైద్యులు అనంత్, రాజు, స్వామి, బాలసునీల్ తదితరులు పాల్గొన్నారు.

## గజ్వేల్ టూ కొడంగల్!

- ఆర్‌అండ్‌బీ ఈఈ కార్యాలయం తరలింపునకు రంగం సిద్ధం
- సీఎం సొంత నియోజకవర్గంలోని 'కడా'తో అనుసంధానం
- అక్కడ అభివృద్ధి పనులు జరుగుతున్న వేళ ఈ నిర్ణయం?
- కళ తప్పనున్న మాజీ సీఎం కేసీఆర్ 'ఇలాకా'



గజ్వేల్‌లోని ఇంటిగ్రేటెడ్ ఆఫీస్ కాంప్లెక్స్ భవన సముదాయం

గజ్వేల్: మాజీ సీఎం కేసీఆర్ 'ఇలాకా' గజ్వేల్ నుంచి ఆర్‌అండ్‌బీ ఈఈ కార్యాలయం తరలింపునకు రంగం సిద్ధమైనట్లు తెలిసింది. ప్రస్తుత సీఎం రేవంత్‌రెడ్డి సొంత నియోజకవర్గం కొడంగల్‌లో భారీ అభివృద్ధి పనులకు తెరతీసిన వేళ.. కడా(కొడంగల్ ఏరియా డెవలప్‌మెంట్ అథారిటీ)తో ఇక్కడి అధికారులను అనుసంధానం చేయనున్నట్లు సమాచారం. త్వరలోనే ఇక్కడి ఆర్‌అండ్‌బీ ఈఈ కార్యాలయం ఫర్నిచర్‌తో సహా తరలిపోనున్నట్లు తెలుస్తోంది.

2014లో ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన కేసీఆర్... గజ్వేల్‌ను దేశంలోనే ఆదర్శ నియోజకవర్గంగా తీర్చిద్దడానికి సంకల్పించారు. ఇందుకోసం 'గడా'(గజ్వేల్ ఏరియా డెవలప్‌మెంట్ అథారిటీ)ని ఏర్పాటు చేశారు. సీఎంగా తను నిత్యం నియోజకవర్గ ప్రజలను కలిసే అవకాశం లేనందువల్ల తన ప్రతినిధిగా సేవలందించడానికి 'గడా'కు ప్రత్యేకాధికారిని నియమించారు. కేసీఆర్ ఆశించినట్లుగానే 'గడా' గజ్వేల్ అభివృద్ధికి సోపానంగా నిలిచింది. అభివృద్ధి పనుల పర్యవేక్షణలో 'గడా' కీలక భూమిక వహించింది. 2023 అసెంబ్లీ ఎన్నికల తర్వాత బీఆర్‌ఎస్ అధికారం కోల్పోయి కాంగ్రెస్ ప్రభుత్వం కొలువుదీరడంతో 'గడా' యథాతథంగా రద్దయిన సంగతి తెలిసిందే.

**40కి పైగా ప్రభుత్వ శాఖలు ఒకే చోట..**

'గడా'తోపాటుగానే కేసీఆర్ గజ్వేల్‌లో జిల్లా కేంద్రం తరహాలో ప్రభుత్వ కార్యాయాలను ఏర్పాటు చేయించారు. 40కిపైగా ప్రభుత్వ శాఖలు ఒకే ప్రాంగణంలో విధులు నిర్వహించుకునేవిధంగా వీలుగా రాష్ట్రంలోనే మోడల్‌గా ఇంటిగ్రేటెడ్ ఆఫీస్ కాంప్లెక్స్(ఐఓసీ) నిర్మించారు. ప్రత్యేకించి మల్లన్నసాగర్, కొండపోచమ్మసాగర్ రిజర్వాయర్ల నిర్వహణ కోసం ఇక్కడ రాష్ట్రంలోనే కీలకమైన ఇరిగేషన్ ఈఎన్‌సీ కార్యాలయాన్నీ, దీనికి అనుబంధంగా గజ్వేల్, సిద్దిపేట, భువనగిరి, మెదక్ సర్కిల్ కార్యాలయాలు, వీటి కింద డివిజన్, సబ్ డివిజన్ కార్యాలయాలను ఏర్పాటుచేశారు. ప్రస్తుతం ఈ కార్యాలయాలు గజ్వేల్ ఐఓసీలోనే కొనసాగుతుండటం జిల్లా కేంద్రాన్ని తలపిస్తున్నది. ఇదే తరహాలో ఆర్‌అండ్‌బీ శాఖ పరిధిని కూడా పెంచి ఇక్కడ ఈఈ పర్యవేక్షణలోని డివిజన్ కార్యాలయాన్ని ఏర్పాటు చేశారు. దీని పరిధిలో గజ్వేల్, జగదేవ్‌పూర్‌తోపాటు పలు సబ్ డివిజన్ కార్యాలయాలను నిర్వహిస్తున్నారు. ఈఈ కార్యాలయంలో ప్రస్తుతం ఈఈతోపాటు ఒక డీఏఓ, ఒక సూపరింటెండెంట్, సీనియర్ అసిస్టెంట్, హెచ్‌ఆర్ ఇన్‌చార్జి, జూనియర్ అసిస్టెంట్, ఈఈ పీఏ, అటెండర్లతోపాటుగా మరో ఏఈఈ పనిచేస్తున్నారు. ఈ కార్యాలయాన్ని త్వరలోనే కొడంగల్‌ను తరలించడానికి రంగం సిద్ధమైనట్లు ప్రచారం జరుగుతోంది. ఇందుకు సంబంధించి జీఓ కూడా వెలువడనుందని సమాచారం.

**పీఆర్ ఈఈ కార్యాలయం సైతం..**

ఇక్కడున్న పీఆర్ ఈఈ కార్యాలయం కూడా తరలింపునకు అవకాశమున్నదని తెలుస్తోంది. ఇదిపోతే ప్రస్తుతం గజ్వేల్ కేంద్రంగా ఇరిగేషన్ ఈఎన్‌సీ కార్యాలయం పరిధిలో సిద్దిపేట, భువనగిరి, మెదక్ సర్కిల్ కార్యాలయాలు ఇక్కడే కొనసాగుతుండగా, ఇవీ కూడా వాటి సొంత జిల్లాలకు తరలిపోనున్నాయని ప్రచారం జరుగుతోంది. ఇదంతా జరిగితే గజ్వేల్ ఇక కళను కోల్పోవడం ఖాయమని ఇక్కడి ప్రజలు చర్చించుకుంటున్నారు. కార్యాలయాల తరలింపు అంశంపై ఇక్కడ పనిచేస్తున్న సీనియర్ అధికారి 'సాక్షి'తో మాట్లాడుతూ ఆర్‌అండ్‌బీ ఈఈ కార్యాలయం మాత్రమే ఇక్కడి నుంచి తరలిపోయే అవకాశాలు కనిపిస్తున్నాయని, ఇతర కార్యాలయాలకు ఇబ్బంది ఉండదని చెప్పారు.

## క్లుప్తంగా

### కస్టమర్ కేర్‌కు ఫోన్ చేసే క్రమంలో..
– సైబర్ మోసం

**పటాన్‌చెరు టౌన్:** నగదు క్రెడిట్ కార్డులో అప్‌డేట్ కాలేదని కస్టమర్ కేర్‌కు ఫోన్ చేసే క్రమంలో సైబర్ వలలో పడి బాధితుడు నగదు పోగొట్టుకున్నాడు. ఈ సంఘటన పటాన్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం... పటాన్‌చెరు మండలం ముత్తంగి డీఎస్ కాలనీకి చెందిన ఒక కిరాణా షాప్ నిర్వాహకుడు. ఈనెల 10న తన క్రెడిట్ కార్డుకు చెల్లించిన నగదు అప్‌డేట్ చూపించకపోవడంతో కస్టమర్ కేర్‌కు ఫోన్ చేసే క్రమంలో సైబర్ వలలో పడ్డాడు. దీంతో అపరిచిత వ్యక్తి చెప్పిన విధంగా తన వివరాలు తెలపడంతో ఖాతాలో ఉన్న రూ.83 వేల నగదు డ్రా అయినట్లు మెసేజ్ వచ్చింది. దీంతో బాధితుడు వెంటనే సైబర్ క్రైమ్ పోలీసులకు ఫిర్యాదు చేసి, అనంతరం పటాన్‌చెరు స్టేషన్ లో ఫిర్యాదు చేశాడు.

### ట్రాక్టర్‌ను ఢీ కొట్టిన కారు
– రెండు ముక్కలైన వాహనం


రెండుగా విడిపోయిన ట్రాక్టర్

**కొండాపూర్(సంగారెడ్డి):** ముందున్న ట్రాక్టర్‌ను అతి వేగంతో వచ్చిన కారు బలంగా ఢీకొట్టగా.. ఇంజిన్ రెండు భాగాలుగా విడిపోయింది. ఈ సంఘటన మంగళవారం మండల పరిధిలోని మునిదేవునిపల్లిలో చోటు చేసుకుంది. ప్రత్యక్ష సాక్షులు తెలిపిన వివరాల ప్రకారం .. మునిదేవునిపల్లికి చెందిన విఠల్ ట్రాక్టర్‌ను తీసుకొని తన పొలానికి వెళ్తున్నాడు. కుడి వైపునకు తిరుగుతుండగా సంగారెడ్డి నుంచి మైతాబ్‌ఖాన్ గూడెం వైపు వస్తున్న ఎల్ అండ్ టీ సంస్థకు చెందిన కారు.. ట్రాక్టర్‌ను బలంగా ఢీకొట్టింది. ఈ ఘటనలో ట్రాక్టర్ ఇంజిన్ రెండు భాగాలు విడిపోయింది. డ్రైవర్‌కు స్వల్ప గాయాలయ్యాయి. క్షతగాత్రుడిని చికిత్స కోసం సంగారెడ్డిలోని ఒక ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారని సాక్షులు తెలిపారు.

### ప్రాణం తీసిన ఈత సరదా
ఇసుక మడుగులో దిగి యువకుడి మృతి


ఇలియాజ్(ఫైల్)

**పెద్దశంకరంపేట(మెదక్):** సరదాగా స్నేహితులతో కలిసి విందు చేసుకొని ఇసుక మడుగులో దిగి ఓ యువకుడు మృత్యువాత పడ్డాడు. ఈ సంఘటన మండల కేంద్రంలో మంగళవారం చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. పెద్దశంకరంపేటకు చెందిన మహమ్మద్ ఇలియాజ్(30) సోమవారం సాయంత్రం తన స్నేహితులైన ఎండీ.షాదుల్, సుల్తాన్, ఎస్.యాదగిరిలతో కలిసి శివారులోని మైసమ్మ చెరువు వద్ద విందు చేసుకొని మద్యం తాగారు. ఆ మత్తులో చెరువు వద్ద ఇసుక మడుగులో ఈతకు దిగి మునిగి చనిపోయాడు. స్నేహితులు, స్థానికులు కలిసి చెరువులో వెతికినా ఫలితం లేకపోయింది. మంగళవారం ఉదయం మృతదేహం లభ్యమైంది. ఇలియాజ్ లారీ డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. మృతుడి తల్లి మహమ్మద్ హసీనా బేగం ఫిర్యాదు మేరకు ఎస్‌ఐ.శంకర్ కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

### సెంట్రింగ్ కలప ట్రాక్టర్ బోల్తా

**నర్సాపూర్:** సెంట్రింగ్ పనిలో ఉపయోగించే కలపను తరలిస్తున్న ట్రాక్టర్ నర్సాపూర్ –హైదరాబాద్ మార్గంలో బోల్తా పడింది. సంగారెడ్డి జిల్లా గుమ్మడిదల్ల మండలం దోమడుగు నుంచి సెంట్రింగ్ పనిలో ఉపయోగించే కలపను నర్సాపూర్‌కు ట్రాక్టర్‌లో తీసుకువస్తుండగా పట్టణ శివారులో ట్రాక్టర్ బోల్తా పడింది. సరుకు అంతా రోడ్డుపై అడ్డంగా పడటంతో ట్రాఫిక్‌కు అంతరాయం కల్గింది. స్థానిక ఎస్‌ఐ–2 శ్రీనివాస్ తన సిబ్బందితో అక్కడికి వచ్చి దాన్ని తొలగించి ట్రాఫిక్‌ను క్లియర్ చేశారు. కాగా, బోల్తా పడిన ఘటనలో ఇద్దరికి స్వల్ప గాయాలయ్యాయని పోలీసులు చెప్పారు.

# భద్రత డొల్ల



- మసక బారుతున్న ఏడుపాయల ఆలయ ప్రతిష్ట
- హడలెత్తిస్తున్న చోరీలు.. కృంగదీస్తున్న జలమరణాలు
- ఇటీవల హుండీల అపహరణలో పోయింది రూ.3 వేలేనా?
- మొక్కుబడిగా పోలీసులకు ఫిర్యాదు
- పట్టించుకోని ఈఓ

**పాపన్నపేట(మెదక్):** ఆధ్యాత్మిక కేంద్రం.. పర్యాటక క్షేత్రం అయిన ఏడుపాయల భద్రతపై నీలినీడలు కమ్ముకుంటున్నాయి. భద్రతలో డొల్లతనమే కారణమని తెలుస్తోంది. తరచూ దొంగ తనాలు.. స్నానం చేస్తూ భక్తుల మరణాలతో ఆలయ ప్రతిష్ఠ మసక బారుతోంది. తెలంగాణలో ప్రసిద్ధి గాంచిన ఏడుపాయలకు మహారాష్ట్ర, కర్ణాటక, ఆంధ్ర తదితర రాష్ట్రాల నుంచి ఏటా సుమారు 20 లక్షల భక్తులు వస్తుంటారు. సుమారుగా హుండీ ఆదాయం రూ.12 కోట్ల ఆదాయం దాకా వస్తుంది. ఇక్కడ 10 మంది సెక్యూరిటీ, 25 మంది ఉద్యోగులు ఉన్నారు. 46 సీసీ కెమెరాలు ఉంటే అందులో ఐదు పని చేయడం లేదు. ఇటీవల ఏడుపాయల్లో జరుగుతున్న నేర సంఘటనలపై స్పందించిన ఎస్పీ ఉదయ్ కుమార్ రెడ్డి, ఆరుగురు పోలీసులను విధుల్లో ఉంచుతామని ప్రకటించారు. అయినా పోలీస్ ఔట్ పోస్టు నామ మాత్రమే అయ్యింది. నేరాల సంఖ్య తగ్గడం లేదు.

**దొంగతనాలు..:**
శనివారం రాత్రి ఏడుపాయల్లోని ఆలయ మండపంలోకి ఇద్దరు దొంగలు ప్రవేశించి ఏకంగా 1, 12 నంబర్ ఇనుప హుండీలు ఎత్తుకెళ్లారు. వాటిలో ఉన్న నగదు, కానుకలు దొంగిలించి, ఖాళీ హుండీలను 100 మీటర్ల దూరంలో పడేసి వెళ్లారు. అయితే విధుల్లో ఉండాల్సిన ఇద్దరు సెక్యూరిటీ, వాచ్‌మన్ ఈఓ కార్యాలయంలో తమకేమి పట్టనట్లు నిద్రపోయారని తెలిసింది. అక్కడ సీసీ కెమెరాలున్నా కనీసం వాటి వైపు తొంగి చూడలేదు. దొంగతనం జరిగిన విషయం తెలిసినా, కనీసం ఈఓ కృష్ణ ప్రసాద్ తెల్లవారుజామున కూడా ఆలయానికి చేరుకోలేదు. పోలీసులకు స్వయంగా ఫిర్యాదు చేయలేదు. ఆలయంలో ఉన్న ఉద్యోగి ఒకరు మొక్కుబడిగా ఫిర్యాదు చేశారు. 10 రోజులపాటు భక్తులు వేసిన సొమ్ము, రెండు హుండీలతో కలిపి సుమారు రూ.3 వేలు ఉండొచ్చునని ఫిర్యాదు చేశారు.


దొంగతనం జరిగిన హుండీని తీసుకొస్తున్న సిబ్బంది

#### రెండేళ్ల క్రితం..

రెండేళ్ల క్రితం ఇలాగే ఓ వ్యక్తి మండపంలోకి ప్రవేశించి దొంగతనానికి పాల్పడితే కేవలం రూ.80 వేల సొత్తు చోరీ జరిగి ఉంటుందంటూ పోలీసులకు ఫిర్యాదు చేశారు. దొంగను పట్టుకొని అతడి నుంచి రూ.3.60 లక్షలను పోలీసులు రికవరీ చేశారు. గతంలో సైతం ఆలయంలో పనిచేసే ఓ ఉద్యోగి దుర్గమ్మ గర్భగుడికి సంబంధించిన కడప వెండి తొడుగు దొంగిలించారు. అంతకు ముందు పలు సార్లు దుర్గమ్మ ఆలయ హుండీ పగులగొట్టిన దొంగలు నగదు ఎత్తుకెళ్లారు. ఇటీవల ఆరు నెలల కాలంలో సుమారు 10 నుంచి 12 మంది భక్తులు ఏడుపాయల్లో స్నానం చేస్తూ నీట మునిగి మరణించారు. అయినా పట్టించుకునే నాథుడే కరువయ్యారని భక్తులు వాపోతున్నారు. ఈ విషయమై ఈఓ కృష్ణ ప్రసాద్‌ను వివరణ కోరగా చోరీ జరిగిన రోజు తాను సెలవులో ఉన్నానన్నారు. ఆలయానికి రాలేకపోయానన్నారు. దొంగ తనం కేసులో పోయింది కేవలం రూ.3 వేలు మాత్రమే అని ఫిర్యాదు చేసి ఉండాల్సింది కాదన్నారు.

# డ్రగ్స్ రహిత జిల్లాయే లక్ష్యం

- సీపీ అనురాధ
- నార్కోటిక్ డ్రగ్ కిట్ల పంపిణీ

**సిద్దిపేటకమాన్:** డ్రగ్స్ రహిత జిల్లాగా చేయడమే మన ప్రధాన లక్ష్యమని సిద్దిపేట పోలీసు కమిషనర్ అనురాధ అన్నారు. పోలీస్ కమిషనర్ కార్యాలయంలో త్రీ టౌన్ సీఐ విద్యాసాగర్‌తో పాటు పోలీసు అధికారులు, సిబ్బందికి నార్కోటిక్ డ్రగ్ కిట్లను (100కిట్లు) మంగళవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. పోలీసు అధికారులు, సిబ్బంది వాహనాల తనిఖీ సమయంలో అనుమానం ఉన్న వ్యక్తులను నార్కోటిక్ డ్రగ్ కిట్స్ ద్వారా పరిశీలించాలని సూచించారు. జిల్లావ్యాప్తంగా గుర్తించిన బ్లాక్ స్పాట్స్ ప్రాంతాల్లో తనిఖీలు నిర్వహించినప్పుడు వీటిని ఉపయోగించాలన్నారు. మాదకద్రవ్యాల నిర్మూలన మనందరి బాధ్యత అన్నారు. పిల్లల ప్రవర్తనపై తల్లిదండ్రులు దృష్టి పెట్టాలని సూచించారు. గంజాయి, ఇతర మత్తు పదార్థాలు సేవించే వారి మానసిక స్థితి కోల్పోయి నేరాలకు పాల్పడే అవకాశం ఉంటుందన్నారు. వాటిని తీసుకోవడం వల్ల ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం ఉంటుందని తెలిపారు. మాదకద్రవ్యాల విషయంలో ఎవరిని వదిలి పెట్టే ప్రసక్తే లేదని హెచ్చరించారు. వీటికి యువతను దూరంగా ఉంచాలన్నారు. డ్రగ్స్ రహిత తెలంగాణ సమాజం కోసం అందరూ కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో అడిషనల్ డీసీపీ మల్లారెడ్డి, త్రీ టౌన్ సీఐ విద్యాసాగర్, ఎస్‌ఐ చంద్రం, పోలీసు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.


త్రీ టౌన్ సీఐ విద్యాసాగర్, సిబ్బందికి నార్కోటిక్ డ్రగ్స్ కిట్లను పంపిణీ చేస్తున్న సీపీ అనురాధ

### డ్రంకెన్ డ్రైవ్‌లో 72 మందిపై కేసులు

**సిద్దిపేటకమాన్:** జిల్లా వ్యాప్తంగా పోలీసులు స్పెషల్ డ్రైవ్ నిర్వహించి ఆకస్మిక వాహన తనిఖీలను నిర్వహించారు. కమిషనరేట్ పరిధిలో సోమవారం సాయంత్రం 7 నుంచి రాత్రి 9 గంటల వరకు నిర్వహించిన ఈ తనిఖీల్లో మద్యం తాగి బైక్‌లు నడుపుతూ పట్టుబడిన 72 మందిపై డ్రంకెన్ డ్రైవ్ కేసులు నమోదు చేసినట్లు సీపీ అనురాధ తెలిపారు. ట్రాఫిక్, రోడ్డు నిబంధనలు పాటించకుండా నెంబర్ ప్లేట్ లేని 62 వాహనాలపై కేసులు నమోదు చేశామన్నారు. కార్యక్రమంలో వన్ టౌన్ సీఐ లక్ష్మీబాబు, టూటౌన్ సీఐ ఉపేందర్, త్రీ టౌన్ సీఐ విద్యాసాగర్, రూరల్ సీఐ శ్రీను, ట్రాఫిక్ సీఐ ప్రవీణ్‌కుమార్, పోలీసు అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# చిరుధాన్యాలతో ఆరోగ్యం

రాష్ట్ర మహిళా సహకార అభివృద్ధి సంస్థ కార్పొరేషన్ చైర్‌పర్సన్ శోభారాణి

**జగదేవ్‌పూర్(గజ్వేల్):** అంగన్‌వాడీ కేంద్రాల్లో చిరుధాన్యాలతో కూడిన పౌష్టికాహారం అందించడానికి ప్రభుత్వం ప్రక్రియ ప్రారంభించిందని, ఇవి ఆరోగ్యకరమని రాష్ట్ర మహిళా సహకార అభివృద్ధి సంస్థ కార్పొరేషన్ చైర్‌పర్సన్ శోభారాణి పేర్కొన్నారు. మంగళవారం మండల కేంద్రమైన జగదేవ్‌పూర్‌లో పీస్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో జీవ వైవిధ్యంపై మహిళలకు అవగాహన సదస్సు నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఆమె హాజరై మాట్లాడారు. పాత రోజుల్లో తాతముత్తాలు సేంద్రియ ఎరువులతో పంటలు పండించేవారని గుర్తు చేశారు. చిరుధాన్యాలను ఆహారంగా తీసుకోవడం వల్ల ఆరోగ్యంగా పది కాలల పాటు బతికారన్నారు. కానీ నేడు రసాయన ఎరువులతో పంటలు పండించి వాటినే ఆహారంగా తీసుకోవడంతో మనషుల జీవన ప్రమాణాలు తగ్గిపోయాయన్నారు. ఆ పంటల సాగును మహిళలు అలవాటు చేసుకోవాలన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అంగన్‌వాడీ కేంద్రాల్లో చిరుధాన్యాలతో కూడిన పౌష్టికాహారం అందించేందుకు ప్రణాళిక రూపొందిస్తుందన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి మహిళల ఆర్థిక అభివృద్ధికి పెద్దపీట వేస్తున్నారని తెలిపారు. అంతకు ముందు కొండ పోచమ్మ అమ్మవారిని దర్శించుకున్నారు. కార్యక్రమంలో సంస్థ డైరెక్టర్ నిమ్మయ్య, మ్యాక్స్ డైరెక్టర్ అరుణ, మాజీ ఎంపీటీసీ కవిత, కాంగ్రెస్ మండలాధ్యక్షుడు రవీందర్‌రెడ్డి, సిబ్బంది మహేశ్, పద్మ, శోభ, వెంకట్‌లక్ష్మి, నాగమణి, రాజు, నరేశ్, నిఖిల్, మహిళలు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న మహిళా సహకార అభివృద్ధి సంస్థ కార్పొరేషన్ చైర్‌పర్సన్ శోభారాణి

# బీబీపేట పాఠశాల ముట్టడి

**కల్హేర్(నారాయణఖేడ్):** మధ్యాహ్న భోజనం తిని అస్వస్థతకు గురైన ఘటనపై మంగళవారం అధికారులు విచారణకు వచ్చారని తెలుసుకున్న విద్యార్థుల తల్లిదండ్రులు, గ్రామస్తులు మండలంలోని బీబీపేట పాఠశాలను ముట్టడించారు. ఎంపీడీఓ శ్రీనివాస్, ఎంఈఓ శంకర్ స్కూల్‌ను సందర్శించగా.. వారి వద్ద పాఠశాల హెచ్‌ఎం, వంట నిర్వాహకుల నిర్లక్ష్యమే కారణమని విమర్శించారు. ఇప్పటికే హెచ్‌ఎం నర్సింగ్‌ను సస్పెండ్ చేసినట్లు అధికారులు తెలిపారు. అయినా జెడ్పీహెచ్‌ఎస్, ప్రాథమిక పాఠశాలలో మధ్యాహ్న భోజనం వంట నిర్వాహకులను తొలగించాలని పట్టుబట్టారు. కొత్తగా కమిటీని నియమించాలని డిమాండ్ చేశారు. దీంతో కొంతసేపు అధికారులకు, గ్రామస్తులకు మధ్య వాగ్వాదం జరిగింది. ఈ నెల 20న కొత్తగా కమిటీ ఏర్పాటు చేస్తామని, వంట నిర్వాహకులను నియమిస్తామని భరోసా ఇవ్వడంతో ఆందోళనకారులు శాంతించారు. పాఠశాలలో వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. డిప్యూటీ డీఎంహెచ్‌ఓ సంధ్యారాణి పాఠశాలను సందర్శించారు. విద్యార్థులకు వైద్య పరీక్షలు చేయించారు. కార్యక్రమంలో స్కూల్ కాంప్లెక్స్ హెచ్‌ఎం శ్రీనివాస్, కాంగ్రెస్ నాయకులు బండారి సాయిలు, బీఆర్‌ఎస్ నాయకులు మారపు సాయిలు పాల్గొన్నారు.


పాఠశాలలో ఆందోళన చేస్తున్న తల్లిదండ్రులు, గ్రామస్తులు

# బైకుల దొంగ అరెస్టు

- 15 బైకులు స్వాధీనం
- జల్సాలకు అలవాటు పడి చోరీలు : ఎస్పీ ఉదయ్

**చేగుంట(తూప్రాన్):** బైకులను దొంగతనం చేస్తున్న వ్యక్తిని అరెస్టు చేసి 15 బైకులు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్పీ ఉదయ్‌కుమార్‌రెడ్డి పేర్కొన్నారు. మంగళవారం చేగుంట పోలీస్ స్టేషన్‌లో విలేకరుల సమావేశం నిర్వహించి వివరాలను వెల్లడించారు. చేగుంట ఎస్‌ఐ బాలరాజు జాతీయ రహదారిపై వాహన తనిఖీల్లో భాగంగా మాసాయిపేట మండల కేంద్రానికి చెందిన మోతి జనార్దన్ బైకును ఆపడానికి ప్రయత్నించగా వాహనం వదిలేసి పారిపోయేందుకు యత్నించాడు. అనుమానంతో అతడిని పట్టుకొని విచారిస్తే మాసాయిపేటకు చెందిన అతడి స్నేహితులు లక్ష్మణ్, జగన్‌లు జల్సాలకు అలవాటు పడి చేగుంట, తూప్రాన్, మెదక్, నిజాంపేట్, మేడ్చల్, హైదరాబాద్‌లో పార్కింగ్ చేసిన ద్విచక్ర వాహనాలు దొంగలించి అమ్ముకుంటున్నట్లు తెలిపాడు. దొంగతనం చేసిన బైకుల్లో 6 బైకులను సిర్నాపల్లికి చెందిన శ్రీకాంత్‌కు అమ్మినట్లు నిందితుడు ఒప్పుకున్నాడు. మిగతా వాటిని మాసాయిపేటలోనే వారి ఇంటి సమీపంలో చెట్ల పొదల్లో దాచినట్లు అంగీకరించాడు. అతడి నుంచి 15 బైకులను స్వాధీనం చేసుకున్నారు. నిందితుడిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలిస్తున్నట్లు ఎస్పీ తెలిపారు. మిగతా నిందితులు పరారీలో ఉన్నారని, త్వరలోనే పట్టుకుంటామన్నారు. సమావేశంలో తూప్రాన్ డీఎస్పీ వెంకట్‌రెడ్డి, రామాయంపేట సీఐ వెంకట్‌రాజాగౌడ్, పోలీస్ సిబ్బంది ఉన్నారు.



మాట్లాడుతున్న ఎస్పీ ఉదయ్‌కుమార్‌రెడ్డి

## అనుమానాస్పద స్థితిలో యువతి మృతి

**పటాన్‌చెరు టౌన్:** అనుమానాస్పద స్థితిలో యువతి మృతిచెందిన సంఘటన బొల్లారం పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం వివరాలిలా ఉన్నాయి. బొల్లారం పారిశ్రామికవాడ .. మల్లంపేట సమీపంలో 25 సంవత్సరాల వయసు గల గుర్తుతెలియని యువతి అనుమానాస్పద స్థితిలో మృతిచెందింది. మంగళవారం పారిశుద్ధ్య కార్మికుడు చెత్త సేకరణకు వెళ్లి గమనించినట్లు పోలీసులకు సమాచారం ఇచ్చాడు. దీంతో ఘటన స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం పటాన్‌చెరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదైంది.

### మద్యంమత్తులో బైక్ నడిపి.. వృద్ధ జంటను ఢీకొట్టి..

**కొల్చారం(నర్సాపూర్):** మద్యంమత్తులో బైక్ నడిపి.. రోడ్డు పక్క నుంచి నడుచుకుంటూ వెళ్తున్న వృద్ధ దంపతులను బైక్‌తో ఢీకొట్టారు. దీంతో ఇద్దరికి గాయాలయ్యాయి. ఈ ఘటన మండల కేంద్రంలోని పోలీస్‌స్టేషన్ సమీపంలో మంగళవారం చోటుచేసుకుంది. తెలిసిన వివరాల ప్రకారం.. కొల్చారం మండలం అప్పాజీపల్లికి చెందిన రాజబోయిన జోగయ్య–శంకరమ్మ దంపతులు మండల పరిషత్ కార్యాలయంలో పని ఉండగా నడుచుకుంటూ వస్తున్నారు. ఇదే సమయంలో మెదక్ మండలం ఖాజీపల్లికి చెందిన ఇద్దరు బైక్ పై అతి వేగంగా వచ్చి వారిని ఢీకొట్టారు. ఈ ప్రమాదంలో జోగయ్య కాలు విరగగా, శంకరమ్మకు సైతం గాయాలయ్యాయి. సమాచారం తెలుసుకున్న పోలీసులు ఘటన స్థలానికి చేరుకుని క్షతగాత్రులను 108లో మెదక్ ఏరియా ఆస్పత్రికి తరలించారు. ప్రమాద సమయంలో బైక్ నడుపుతున్న వారు మద్యం తాదగి ప్రమాదానికి కారణమయ్యారని ఎస్‌ఐ మహమ్మద్ గౌస్ తెలిపారు.

### రేషన్ బియ్యం స్వాధీనం
– ఇద్దరిపై కేసు

**కొమురవెల్లి(సిద్దిపేట):** అక్రమంగా నిల్వ ఉంచిన రేషన్ బియ్యాన్ని పట్టుకుని ఇద్దరిపై కేసు నమోదు చేశారు. ఈ సందర్భంగా కొమురవెల్లి ఎస్‌ఐ రాజు గౌడ్ మాట్లాడారు. గ్రామంలో రేషన్ బియ్యాన్ని కొంతమంది అక్రమంగా నిల్వ ఉంచారనే నమ్మదగిన సమాచారంతో టాస్క్‌ఫోర్స్, పోలీసులు దాడులు నిర్వహించారు. గ్రామంలోని కడమంచి మల్లేశం, కడమంచి తిరుపతి ఇళ్లల్లో అక్రమంగా నిల్వ ఉంచిన 16.30 క్వింటాళ్ల బియ్యాన్ని గుర్తించారు. వీటిని స్వాధీనం చేసుకున్నారు. వీరిపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్‌ఐ తెలిపారు.

# ముగ్గురిపై హత్య కేసు నమోదు

**అక్కన్నపేట(హుస్నాబాద్):** 11 గుంటల భూమి వివాద విషయమై రాజును హత్య చేసిన ఘటనలో ముగ్గురిపై కేసు నమోదైందని ఎస్‌ఐ విజయభాస్కర్ మంగళవారం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. మరదలు లలిత, మృతుడి తమ్ముడు గుగులోతు భీమా, అతడి కుమారుడు అనిల్‌పై మృతుడి కుమారుడు అశోక్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు హత్య నేరం కింద కేసు నమోదు చేసినట్లు తెలిపారు. రాజు తన తండ్రి నుంచి వారసత్వంగా వచ్చిన ఎకరం భూమిన్ని గతేడాది డిసెంబర్‌లో అమ్ముకున్నాడన్నారు. జనవరిలో చిన్ననాన్నలు అయిన గుగులోతు ఈర్య, బీలుల నుంచి సర్వే నంబర్ 84/4లో 2 ఎకరాల 4 గుంటల భూమిని రూ.21లక్షలకు కొనుగోలు చేసుకున్నారన్నారు. అయితే ఈ భూమి మొత్తం మరదలు లలిత పేరుపైన ఉందన్నారు. అలాగే ఈ భూమిలో నుంచి 11 గుంటల భూమి మృతుడి తమ్ముడు భీమాకు వస్తుందని అతడు ఆక్రమించి సాగు చేస్తున్నాడన్నారు. ఈ క్రమంలో మృతుడికి, మృతుడి తమ్ముడి మధ్య అనేకసార్లు గొడవలు, పెద్ద మనుషుల్లో పంచాయితీలు జరిగాయన్నారు. అయినా వినకుండా దున్నుకుంటూ వస్తున్నాడన్నారు. ఈ నేపథ్యంలో భూ తగాదాలు మనసులో పెట్టుకొని హత్యకు ఒడిగట్టినట్లు ఎస్సై పేర్కొన్నారు.

# బాధ్యులను గుర్తించాం

డీఆర్‌డీఏ అడిషినల్ పీడీ బాలకృష్ణ

**కొండపాక(గజ్వేల్):** ఉపాధి హామీ డబ్బులను అక్రమంగా డ్రా చేసిన బాధ్యులను నిధులను గుర్తించామని డీఆర్‌డీఏ అడిషనల్ పీడీ బాలకృష్ణ పేర్కొన్నారు. కుకునూరుపల్లి మండలం మంగోల్‌లో 2023–24లో జరిగిన ఈజీఎస్ పనుల్లో రూ.3.54 లక్షలను అక్రమ డ్రా చేసిన విషయమై మంగళవారం గ్రామపంచాయతీ కార్యాలయం వద్ద విచారించారు. హైదరాబాద్‌లో నివాసం ఉంటున్న వారి పేరిట ఈజీఎస్ పనులు చేసినట్లు తప్పుడు రికార్డులు చేసి డబ్బులు డ్రా చేశారంటూ మాజీ సర్పంచ్ కిరణ్‌కుమార్‌చారి సమావేశం దృష్టికి తెచ్చారు. హరితాహారం మొక్కల సంరక్షణ కోసం ట్యాంకర్‌తో నీరు పోయకపోయినా చెక్కు రాశారని, ఫోర్జరీ సంతకాలతో రెండు రిజిస్టర్‌లను నిర్వహిస్తూ లక్షల రూపాయల ప్రజాధనాన్ని దుర్వినియోగం చేస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని కోరారు. ప్రత్యేకాధికారుల పాలనలో ఉపాధి పనుల నిధుల్లో అక్రమాలు జరిగాయంటూ గ్రామస్తులు సమావేశం దృష్టికి తెచ్చారు. ఈ సందర్భంగా బాలకృష్ణ మాట్లాడుతూ బాధ్యుల నుంచి 15 రోజుల్లో రికవరీ చేసి జీపీ అకౌంట్లో జమ చేస్తామన్నారు. ఎంక్వైరీ రిపోర్టులను పై అధికారులకు అందజేస్తామన్నారు. శాఖాపరమైన చర్యలు తీసుకునేలా చూస్తామన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ వెంకటేశ్వర్లు, ఎంపీఈఓ వీరరాజు, సూపరింటెండెంట్ రాంప్రసాద్, ఈజీఎస్ సిబ్బంది, పంచాయితీ కార్యదర్శి, నాయకులు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.


సమావేశాన్ని నిర్వహిస్తున్న డీఆర్‌డీఏ అడిషనల్ పీడీ బాలకృష్ణ

## సేంద్రియం.. నేలకు బలం

**అక్కన్నపేట(హుస్నాబాద్):** కొన్నేళ్లుగా అధిక దిగుబడి కోసం రైతులు విచక్షణారహితంగా రసాయన ఎరువులు, క్రిమిసంహారక మందులు వాడుతున్నారని లొడి సంస్థ ప్రాజెక్టు కో–ఆర్డినేటర్ బాలగౌరి అన్నారు. మండల కేంద్రం పరిధిలోని బోదర్ వాగుతండాలో మంగళవారం లొడి సాంఘిక సేవా సంస్థ అధ్వర్యంలో మాహోస్ యూనిదాస్ వారి సహకారంతో లొడి సంస్థ డైరెక్టర్ ఇన్నారెడ్డి ఆదేశాల మేరకు రైతులకు ఇంటిగ్రేటెడ్ పెస్టి సైడ్స్ మేనేజ్‌మెంట్(ఐపీఎం), నాన్ పెస్టి సైడ్స్ మేనేజ్‌మెంట్(ఎన్‌పీఎం)పై శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో లొడి సంస్థ మండల ఫీల్డ్ కో–ఆర్డినేటర్ కోడం సత్యనారాయణ, కనుకం రవీందర్, భూక్య బిచ్య పాల్గొన్నారు.

# జింక మాంసం స్వాధీనం

పోలీసుల తనిఖీల్లో పట్టివేత

**జోగిపేట(అందోల్):** పట్టణంలో 5 కిలోల జింక మాంసాన్ని మంగళవారం అటవీ శాఖ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. ఆ మేరకు ఇద్దరిని అదుపులోకి తీసుకున్నారు. డిప్యూటీ ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ వేణుగోపాల్ తెలిపిన వివరాల ప్రకారం.. పట్టణంలో జింక మాంసం విక్రయిస్తున్నట్టుగా జోగిపేట పోలీసులకు సమాచారం అందగా హౌసింగ్ బోర్డ్ ప్రాంతంలో తనిఖీ చేశారు. బైక్‌పై వెళ్తున్న గాండ్ల వాజీద్, దూదేకుల ఆసీఫ్ అనే ఇద్దరిని ఆపి తనిఖీలు చేశారు. వారి నుంచి 5 కిలోల మాంసాన్ని స్వాధీనం చేసుకున్నారు. ఇరువురిని అటవీ శాఖ అధికారులకు అప్పగించినట్లు జోగిపేట ఎస్‌ఐ పాండు తెలిపారు. మాంసం శాంపుల్‌లను ల్యాబ్ టెస్టింగ్‌కు పంపనున్నారు. సంగారెడ్డి అటవీ శాఖ కార్యాలయంలో వాజీద్, ఆసీఫ్‌లను విచారిస్తున్నట్లు వేణుగోపాల్ తెలిపారు.

# మెదడు వాపునకు జ్వరం తోడై..

యువకుడు బ్రెయిన్ డెడ్.

**చిన్నశంకరంపేట(మెదక్):** యువకుడికి ఉన్న మెదడు వాపునకు తోడు జ్వరం బారిన పడి బ్రెయిన్ డెడ్‌తో మృతిచెందాడు.
ఈ సంఘటన చిన్నశంకరంపేట మండల కేంద్రంలో విషాదం నింపింది. మండలకేంద్రానికి చెందిన వికాస్ కుమార్ (36) మంగళవారం సికింద్రాబాద్‌లోని ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతిచెందాడు. రెండు రోజులుగా జ్వరంతో బాధపడుతున్న అతను సోమవారం స్థానిక ప్రభుత్వ ఆస్పత్రిలో వైద్య పరీక్షలు నిర్వహించారు. సిబ్బంది రక్తనమూనాలు సేకరించి పరీక్షల కోసం తెలంగాణ డయాగ్నస్టిక్‌కు పంపించారు. అప్పటికే మెదడు వాపు ఉందని, జ్వరం బారిన పడ్డాడని మెడికల్ ఆఫీసర్ సాయిసింధు తెలిపారు. కాగా, అతడి పరిస్థితి మరింత విషమించడంతో మంగళవారం తెల్లవారుజాము కుటుంబసభ్యులు సికింద్రాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. ఇక్కడ చికిత్స పొందుతూ బ్రెయిన్ డెడ్‌తో యువకుడు మృతిచెందాడని వారు తెలిపారు.


వికాస్ కుమార్(ఫైల్)

# భూసారం ఆధారంగా ఎరువులు

వరి రైతులకు తోర్నాల వ్యవసాయ శాస్త్రవేత్త పల్లవి సూచన


పల్లవి, తోర్నాల వ్యవసాయ పరిశోధన కేంద్రం శాస్త్రవేత్త

**దుబ్బాకటౌన్:** జిల్లాలో వరి నాట్లు జోరందుకున్నాయి. కానీ వరిలో రసాయన ఎరువులను రైతులు ఏ సమయంలో వేయాలి. ఏ ఎరువులను ఏ మేరకు వాడాలి. ఎలా వేయాలో తెలియక ఏటా నష్టాలను మూట కట్టుకుంటున్నారు. కొన్ని చోట్ల అవసరమైన దాని కంటే ఎక్కువ ఎరువులను, మరి కొన్ని చోట్ల తక్కువ ఎరువులను వేస్తుండటంతో అనుకున్న స్థాయిలో దిగుబడులు రావడం లేదు. ఈ నేపథ్యంలో వరిలో రసాయన ఎరువుల వినియోగంపై తోర్నాల వ్యవసాయ పరిశోధన స్థానం శాస్త్రవేత్త పల్లవి రైతులకు తగు సూచనలు చేశారు.


వరిలో రసాయన ఎరువులు చల్లుతున్న రైతు

**నత్రజని సద్వినియోగమవడం లేదు**

వరిలో రైతులు రసాయన ఎరువులను 80 శాతం వరకు వేస్తున్నారు. యూరియా మోతాదుకు మించి రెండు, మూడు రెట్ల అదనంగా వేస్తున్నారు. ఇదే సమయంలో కొన్ని ప్రాంతాల్లో పొటాష్ వాడకమే లేదు. దీంతో వేస్తున్న రసాయన ఎరువులకు, వాటిని మొక్కలు వినియోగించుకుంటున్న శాతానికి మధ్య వ్యత్యాసం పెరుగుతుంది. దీని వలన జింక్, పొటాష్, ఇనుము మొదలగు లోపాలు ఏర్పడి నత్రజని సద్వినియోగమవడం లేదు.

**పోషకాలకు ప్రాధాన్యం ఇవ్వాలి**

వరిలో రసాయన ఎరువులతో పాటు సేంద్రియ ఎరువులను వాడి పోషకాలు అందించాలి. నత్రజని భాస్వరం, పొటాష్‌లను 4:2:1కు బదులుగా 9:5, 2.7:1 గా అందిస్తున్నారు. నీటి యాజమాన్య పద్ధతులు సరిగా లేకపోవడం వలన వేసిన ఎరువులు వివిధ రూపాల్లో నష్టపోతున్నాయి. పశువులు, కోళ్ల, కంపోస్ట్ వంటి సేంద్రియ ఎరువులను రసాయన ఎరువులతో కలిపి వేసినట్లయితే 20–25 శాతం వరకు రసాయన ఎరువులను ఆదా చేయవచ్చు. వరి పొలాల్లో పప్పు దినుసుల పంటలు, జనుము, జీలుగా వంటి పచ్చిరొట్ట పైర్లను సాగు చేస్తే భూసారం పెంచొచ్చు. భూసారాన్ని బట్టి ఎరువుల మోతాదును నిర్ణయించి, నత్రజని, భాస్వరం, పొటాష్, జింక్‌ను ఇచ్చే ఎరువులను సమంగా వేయాలని పల్లవి తెలిపారు.